వేధిస్తున్న గదుల కొరత


మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- పీహెచ్‌సీలో ఇబ్బందులు పడుతున్న రోగులు, బాలింతలు
- ప్రహరీ లేక ఆవరణలో పశువుల సంచారం
- ప్రతినెల చెట్ల కిందనే సమావేశాలు

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గదుల కొరత సమస్య వేధిస్తుంది. వైద్యం బాగానే అందుతున్నా సరిపడా గదుల లేక అల్లాడుతున్నట్లు రోగులు, బాలింతలు వాపోతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాటు సీజనల్ వ్యాధుల ప్రబలుతున్న నేపథ్యంలో సమస్య తీవ్రతరమవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊరికి దూరంగా..

24 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామానికి దూరంగా ఉండటంతో రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో సరైన వసతులు లేక నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య కేంద్రానికి పూర్తిస్థాయిలో ప్రహరీ లేని కారణంగా ఆవరణలో పందులు, గొర్రెలు సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి.

ఆవరణలోనే సమావేశాలు

ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి ప్రత్యేక గదులు లేకపోవడంతో పాటు ప్రసూతిగదిలో కూడా సరైన వసతులు లేకపోవడం గమనార్హం. అదే విధంగా ప్రతినెల వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసే సమావేశాలు ఆస్పత్రి ఆవరణలోనే చెట్ల కింద నిర్వహించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం వస్తున్న నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రోగులు ప్రజలు కోరుతున్నారు.


చెట్ల కింద నిర్వహిస్తున్న సమావేశాలు(ఫైల్)

సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రతిరోజు ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రహరీగోడ పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తున్నాయి.

– అంజిగౌడ్, మల్దకల్

గదుల సంఖ్య పెంచాలి



ఆస్పత్రిలో రోగులకు సరిపడు గదులు లేక ఇబ్బందులు పడుతున్నాం. సీజనల్ వ్యాధుల కాలంలో ఎక్కువ సంఖ్యలో రోగులు ఆస్పత్రికి రావడంతో ఇరుకుగా ఉండే గదులతో పాటు ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– సవారమ్మ, అమరవాయి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా గదుల సమస్య వేధిస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా వెంటనే ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తాం.

– స్వరూపరాణి, డాక్టర్ మల్దకల్

రోగులకు బ్రెడ్లు, పండ్ల పంపిణీ


ధరూరులో బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ధరూరు: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కంచుకొని రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, బాలింతలకు మండల నాయకులు అందజేశారు. అదే విధంగా ర్యాలంపాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు డీఆర్ విజయ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్లేట్ల పంపిణీ

గట్టు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు గాజుల సంతోష్ సమకూర్చిన 400 ప్లేట్లను నాయకుడు రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ గోపిలత, నాయకులు హనుమంతురెడ్డి, చంద్రశేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కేటీదొడ్డి: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం మండలంలోని వెంకటాపురం పాగుంటలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల సీనియర్ నాయకుడు ఉరుకుందు ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు ఎమ్మెల్యే పేరు మీద అర్చన చేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, డైరెక్టర్ రఘుకుమార్‌శెట్టి, సీనియర్ నాయకులు వెంకన్‌గౌడ్, టీచర్ గోవింద్, రాజేష్, యుగంధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: ప్రభుత్వ కార్యాలయం వెలుపలికి వెళ్లకుండా ప్రజలను అడ్డుకుని ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తులపై కేసు నమోదైనట్లు తెలిసింది. శనివారం ఉదయం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన గేట్ ద్వారం వద్ద ప్రజలు వివిధ సమస్యలపై అధికారులను కలిసి ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న క్రమంలో నీలి శ్రీనివాసులు, దస్తగిరి, దొడ్డప్పతోపాటు మరికొందరు ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో కార్యాలయం వెలుపలికి వెళ్తున్న ఫిర్యాదుదారులను వారు అడ్డుకోవడం, బూతులు తిట్టడంతోపాటు ప్రజాప్రతినిధులను దూషించారు. ఈమేరకు కొందరు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైనట్లు సమాచారం.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అయిజ: మండలంలోని యాపదిన్నెలో ఆదివారం సోషల్ రెస్పాన్స్‌బిలిటీ టీం సభ్యులు పేద కుటుంబానికి రూ. 33,000 ఆర్థిక సహాయం చేశారు. ఈసందర్భంగా టీం సభ్యుడు అశోక్ మాట్లాడారు. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా కుమ్మరి రవి 4 నెలల క్రితం ఆత్మహత్య చేసుకోవడంతో అతని కుటుంబం ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు సంజీవ్, వినోద్, బెంజిమెన్, ఆంజనేయులు, రాముడు, గోకారి పాల్గొన్నారు.

వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

అయిజ: మండలంలోని దేవబండ గ్రామ సమీపంలో ఉన్న వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ నాయకులు బ్రిడ్జి నిర్మించాల్సిన వాగు ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు దేవబండ గ్రామ సమీపంలో బ్రిడ్జిని నిర్మిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు నిర్మించలేదని విమర్శించారు. బ్రిడ్జి నిర్మించకపోవడంతో గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవబండ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా అప్‌గ్రేడ్ చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే బీజేపీ నాయకులు ప్రజల తరుపున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, రామకృష్ణ, నరసింహులు, లక్ష్మణాచారి, శంకరన్న తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పారని మురుగుతో అవస్థలు

మల్దకల్: మండలంలోని అమరవాయి గ్రామంలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగతో నానా అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. పొలాలు, పనులకు వెళ్లే వారు మురుగులో వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిలిచిన మురుగుతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అమరవాయిలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

ప్రజా పోరాటాల్లో వందేళ్ల చరిత్ర


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి విజయరాములు

అమరచింత: దేశ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు ప్రజా పోరాటాల్లో సీపీఐ పార్టీకి వందేళ్ల చరిత్ర ఉందని, ప్రతినిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తి పోరాడే శక్తిగా దేశంలో ఎదిగిందని పార్టీ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. పార్టీ 25వ జాతీయ మహా సభలకు సంఘీభావం తెలుపుతూ మండల కేంద్రంలో ఆదివారం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో వెట్టిచాకిరీ నుంచి తెలంగాణ విముక్తి కోసం సీపీఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక చర్యల వల్ల పేదలు పేదలగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ డీకే అరుణ యూరియా ఇబ్బందులపై జోక్యం చేసుకోకుండా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి రవీందర్, భాస్కర్, శ్యాంసుందర్, ఎర్రన్న, కుతూబ్, కుమార్, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.5.50 లక్షల విరాళం



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో నిర్మిస్తున్న అలివేలు మంగమ్మ ఆలయ నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా అవిప్పాడుకు చెందిన భక్తుడు సెంట్రింగ్ రంగప్ప రూ.5.50 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి దాతను శాలువతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అలంపూర్: కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే విజయుడు ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డికి రూ.60 వేలు, శెట్టిసుధారాణికి రూ.9 వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



గట్టు: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. చేనేత సహకార సంఘం వద్ద బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆప్కో మాజీ డైరెక్టర్ దోమ వీరన్న మాట్లాడుతూ.. స్వాతంత్ర్య కోసం పోరాటం చేసిన యోధుడు లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు చంద్రశేఖర్, జయరాములు, రాఘవేంద్ర, కృష్ణ, వెంకటేష్, మంజునాథ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కేటీదొడ్డి: ఈ నెల 22 నుంచి 24 వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు షేక్ మమునిషా, నందిని అంతర్ జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 25 నుంచి 29 వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పీఈటీ అరుణ తార తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎలిజబిత్ అభినందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఈ క్రమంలో విద్యుత్ తీగలు సమీప గృహాలపై పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరుగకముందే విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం


పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయం

ఇటిక్యాల/శాంతినగర్: మండల పరిదిలోని పెద్ద దిన్నె గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 22 నుంచి నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త జయసింహ ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా క్షీరాభిషేకం, వస్త్ర సమర్పణ మహానైవేద్య తదితర క్రతువులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

* శాంతినగర్‌లోని కోయిల్‌దిన్నె రోడ్డులో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ రావూరి సురేష్‌కుమార్ తెలిపారు. అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు ఉంటాయన్నారు. ఉత్సవాల సందర్భంగా హోమాలు, సామూహిక కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామానికి చెందిన జోగుళాంబ ఆలయ కమిటీ చైర్మన్ బెళగల్ నాగేశ్వర్‌రెడ్డి అన్న సత్యనారాయణ రెడ్డి మనవడు రిషికేశ్వర్‌రెడ్డి (ఆదిరెడ్డి)(18) శనివారం రాత్రి కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఆదిరెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బండారి భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు అబ్రహం, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మదనగోపాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రామాపురంలో గుండెపోటుతో మృతి చెందిన జానయ్య మృతదేహానికి ఎమ్మెల్యే విజయుడు నివాళులర్పించారు.


ఆదిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

రక్షణ గోడ ఏర్పాటు చేయరూ..

మల్దకల్: మండలంలోని తాటికుంట, నాగర్‌దొడ్డి గ్రామ స్టేజీ సమీపంలోని గద్వాల– అయిజ ప్రధాన రహదారిపై కల్వర్టులకు రక్షణ గోడలు లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కల్వర్టుల నిర్మాణ సమయంలో రక్షణ గోడలు నిర్మించకుండ తాత్కాలికంగా ఇనుప కడ్డీలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగా ప్రస్తుతం అవి శిథిలమయ్యాయన్నారు. తరచూ కల్వర్టుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టుల వద్ద రక్షణగోడ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


తాటికుంట స్టేజీ వద్ద రక్షణ గోడ లేని కల్వర్టు

అంధ విద్యార్థులకు అన్నదానం

ఆత్మకూర్: మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన సామాజిక వేత్త దేశాయి పద్మజారెడ్డి అంధ విద్యార్థులకు అన్నదానం చేశారు. ఆదివారం స్థానిక సమ్మిళిత ఫౌండేషన్‌లో ఉంటున్న విద్యార్థులను కలిసి వారికి కావల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఫౌండేషన్ స్థాపించి అంధ విద్యార్థులను ఆదరిస్తున్న నిర్వాహకుడు గాండ్ల శివకుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ ఖాదర్, కబడ్డీ కోచ్ శ్రీనివాసులు, వెంకటరాములు, ఎల్లన్న, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



‘ర్యాపిడో, ఉబర్ యాప్‌లు రద్దు చేయాలి’



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆటో వాలాల పొట్టకొడుతున్న ర్యాపిడో, ఉబర్ యాప్‌లను రద్దు చేయాలని ఆటో జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన జేఏసీ సమావేశంలో ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి రాములు, రామ్మోహన్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాపిడో, ఉబర్, ఓలా యాప్‌లను తీసుకొచ్చి నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాట మాడుతున్నాయని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న సంవత్సరానికి రూ.12 వేలు నేటికీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేవారు. కార్యక్రమంలో యూనియన్ రాజు, నగేశ్, బాబుమీయా తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం


కేటీదొడ్డి మండలం వెంకటాపురంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కేటీదొడ్డి/మల్దకల్/శాంతినగర్/మానవపాడు/ఉండవెల్లి/ధరూరు : మహాలయ అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా కొనసాగింది. ప్రత్యేక పూజల అనంతరం అభిషేకం దీక్షాహోమం, శాంతిహోమం, పూర్ణాహుతి, చక్రస్నానం వంటి క్రతువులు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల భక్తులు పాల్గొన్నారు.

– మల్దకల్ ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, అర్చకులు రమేషాచారి, రవిచారి, ధీరేంద్రదాసు, శశాంక్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

❖ అమావాస్యను పురస్కరించుకొని వడ్డేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో సింధూర అర్చన, ఆకు పూజలు చేశారు. పెత్తర్ల అమావాస్య సందర్భంగా మండల పరిధిలో పితృ దేవతలకు పూజలు చేశారు.

❖ మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆంజనేయస్వామికి అభిషేకాలు, ఆకు పూజ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

❖ ఉండవెల్లి మండలంలోని డి.బూడిదపాడు ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ వైభవంగా జరిగింది. అమావాస్య సందర్భంగా కంచుపాడు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

❖ధరూరు మండల కేంద్రంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంతో పాటు మండల పరిధిలోని పెద్ద చింతరేవుల, అల్వలపాడు, కోతులగిద్ద అరణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో రజక సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మొక్కులు చెల్లించారు.


అమరవాయిలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి


ధరూరులో ఆంజనేయస్వామి ఆలయంలో..


ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు